1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com

ఉగాది పురస్కారం అందుకున్న గాయకురాలు

నవతెలంగాణ-సారంగాపూర్



నిర్మల్ వెన్నెల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో రాష్ట్ర స్థాయి కళా రత్న పురస్కారం-2025, సారంగాపూర్ మండలంలోని జాం గ్రామానికి చెందిన సగ్గం శ్రీష్మ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను మండల నాయకులు అభినందించారు. ఇందులో వెన్నెల డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు ధనరాజ్, రేలా రేలా సూపర్ సింగర్ జాతీయ గాయకుడు రవి, గాయకులు దత్తు, ఫోక్ సింగర్ నాగలక్ష్మి, దిలీప్ నటి స్నేహ శర్మ, ప్రముఖ గాయని, గాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నిషాన్ ఘాట్, 170 కాలనీవాసులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలు ఆదివారానికి 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కనీస సౌకర్యాలైన మంచినీరు, కరెంటు, రోడ్లు, ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బత్తుల గంగారెడ్డి, ఖండాల గణేష్, మహ్మద్ అక్బర్ అలీ, షేక్ తాజుద్దీన్, సీహెచ్ తార, షేక్ అనీఫ్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో గ్రామ యూత్ సభ్యులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేశారు. బ్యాట్‌బాల్ క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి రేపటి గెలుపుకు నాంది అన్నారు. యువత చెడ్ వ్యసనాలకు లోబడకుండా క్రీడాలపై మక్కువ సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతకు ముందు గ్రామస్తులు మాజీమంత్రికి ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, మాజీ జెడ్పీటీసీ ఇజ్జగిరి అశోక్, అజయ్, దాసరి రమేష్, దమ్మపాల్, కొండగణేష్, రంగినేని శ్రీనివాస్, బట్టు సతీష్, మౌర్య సురేందర్, దయాకర్, అశోక్, నిర్వాహకులు వంశీకృష్ణ, శ్రీకాంత్, ప్రశాంత్, రాము పాల్గొన్నారు.

కుభీర్‌లో కుస్తీ పోటీలు



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఆనవాయితీ ప్రకారం ముందుగా విఠలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొనేందుకు మండలంలో వివిధ గ్రామాలతో ప్రజలతో పాటు భైంసా, తానూర్, ముథోల్, కుంటాల, తదితర మండలాలే కాకుండా మహారాష్ట్రలోని భోకర్, నాందేడ్, హిమాయత్‌నగర్‌లకు చెందిన మల్లయోధులు హాజరయ్యారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కేరింతలు కొడుతూ వారికి ఉత్సాహ పరిచారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు అందజేశారు. ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పెంటాజీ, ఉపాధ్యక్షులు సూది రాజన్న, ఎన్నీల అనిల్, నాగలింగం, మల్లేష్, ఏశాల దత్త్రాత్రి, సాయినాథ్, చిమ్మన్, అరవింద్ పాల్గొన్నారు.

తెలంగాణ జానపద జాతర ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



తెలంగాణ జానపద జాతర ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో ఉగాది ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య యజ్ఞం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ నృత్య అకాడమీలకు చెందిన చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలకు జబర్దస్త్ టీం సభ్యులు వినోధిని, నవీన్, సుధాకర్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా వీరు చేపట్టిన కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఇందులో పొన్నం నారాయణగౌడ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-కడెం

రాష్ట్ర సైనిక్, గురుకుల ఫలితాల్లో మండలం లింగాపూర్ గ్రామంలోని శాంతినికేతన్ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ నిషిత విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ పద్మాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జాబితాలో నస్పురి వెంకటేశ్వర్ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించారని అన్నారు. అంతే కాకుండా రాష్ట్ర స్థాయిలో రాజశేఖర్ 9వ ర్యాంక్, రాథోడ్ లోకేష్ 11వ ర్యాంక్, కుంసోత్ దీపక్ 12 వ ర్యాంక్, రితీష్ నాయక్ 22 వ ర్యాంక్, మాలవత్ కిషోర్ 94వ ర్యాంక్, గుండా అనిరుధ్ 135వ ర్యాంక్, చోలే ఆయుష్ 208వ ర్యాంక్, బొమ్మ మహశ్రీ 222 వ ర్యాంక్, క్రిష్ణరాజ్ 266వ ర్యాంక్, కే సాత్విక్ 469వ ర్యాంక్‌లు సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందించారు.

విశ్వ హిందు పరిషత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాంసి

విశ్వ హిందూ పరిషత్ మండల నూతన కమీటీని ఆదివారం మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాతాజీ కార్తిక్, ఉపాధ్యాక్షుడిగా కమ్మరి గోవర్ధన్, పెంటవర్తి అజయ్, ఎలూరి సాయికిరణ్, కార్యదర్శితగా గుగ్గిళ్ళ వెంకటస్వామి, సహ కార్యదర్శి గా కమ్మరి అఖిల్,కట్కుమ్ మార్కండేయ, గుంజరి అక్షయ్‌కుమార్, భజరంగ్ దళ్ సంయోజక్‌గా డోలే దీపక్, సహ సంయోజక్‌గా నాగిడి రాహుల్ రెడ్డి, గోరక్షక్‌గా తరుడి సాయి ఈశ్వర్, సహ గోరక్షక్‌గా కటిక కిశోర్, కొత్రంగి అశోక్‌లను ఎన్నుకున్నారు. ఇందులో పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొండల నారాయణ, సభ్యులు రత్న ప్రకాష్, రాజు, వెంకటస్వామి, మార్కండి ఉన్నారు.

భానుడి భగభగ..!

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- మంచిర్యాలలో 41.4డిగ్రీలు..ఆదిలాబాద్‌లో 41.3డిగ్రీలు
- కుమురంభీం.. నిర్మల్ జిల్లాలోనూ ఇదే స్థాయి వేడి
- గిర్రున తిరుగుతున్న విద్యుత్ మీటర్లు
- ఎండవేడిమి భరించలేక విలవిల్లాడుతున్న జనం

భానుడు తీవ్ర రూపం దాల్చుతున్నారు. రోజురోజుకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. ఉదయం 8గంటలు దాటితే ఇంటి గుమ్మం దాటలేని పరిస్థితి ఉంది. సాయంత్రం 6గంటలు తర్వాతే బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 41డిగ్రీలపైనే నమోదు కావడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు మీటర్లు సైతం అదే స్థాయిలో గిర్రున తిరుగుతున్నాయి. రోజువారీ వినియోగం కంటే ఈ నెలలో భారీగా పెరగడం గమనార్హం. మరోపక్క భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి పడిపోతుండటంతో జనం తాగునీటి కటకటను ఎదుర్కొంటున్నారు.



పగటి పూట ఎండలకు నిర్మానుష్యంగా మారిని ఆదిలాబాద్ జిలా కేంద్రంలో తెలంగాణ చౌక్



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అనూహ్య వాతావరణానికి పెట్టింది పేరు. ఇక్కడ మూడు కాలాలు ఒకదానికొకటి పోటీ పడుతుంటాయి. అధిక వర్షాలు, తీవ్రమైన చలితో పాటు ఎండవేడిమి సైతం అధికంగానే నమోదువుతుంటుంది. ప్రతి ఏటా ఈ పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా గత పక్షం రోజులుగా ఎండలు పెరుగుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రోజువారీగా ఏకంగా 41డిగ్రీలపైనే నమోదవుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. అత్యధికంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో 41.4డిగ్రీలు నమోదు కాగా.. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో 41.3డిగ్రీలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 41.3డిగ్రీలు, నిర్మల్ జిల్లా భైంసాలో 41.2 డిగ్రీలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గత వారం రోజుల నుంచి ఇదే మాదిరి ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో జనం ఇంటి నుంచి కాలు బయటపెట్టడానికి జంకుతున్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అత్యవసర పని ఉన్న వారు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్తున్నారు. ఎండ నుంచి రక్షణ కోసం గొడుగులు, స్కార్ఫ్‌లు తదితర వాటిని ధరిస్తున్నారు.



పెరిగిన విద్యుత్తు వినియోగం..!

ఉమ్మడి జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్తు వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. ఎండ వేడిమి తట్టుకోలేక జనం ఇంటి పట్టునే ఉండటంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు విరామం లేకుండా పనిచేయడం మూలంగా విద్యుత్తు మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇది వరకు రోజువారీ వినియోగం 5.50మిలియన్ యూనిట్లు కాగా.. ప్రస్తుతం సుమారు 7.2మిలియన్ యూనిట్ల వరకు వినియోగం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

తగ్గుతున్న భూగర్భజలాలు..!

అధిక ఎండల కారణంగా భూగర్భజలాలు తరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో 8మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలం..మార్చి నెలకు వచ్చే సరికి ఏకంగా 2మీటర్లు పెరిగి.. 10మీటర్ల లోతులకు వెళ్లిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల తాగునీటి తాపం నెలకొంది. స్థానిక నీటి వనరులైన వాగులు, బావులు, చేతిపంపులు అడుగంటిపోవడం..భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడం మూలంగా జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండగా.. మరికొన్ని చోట్ల స్థానికులు ఎడ్లబండ్ల ద్వారా సమీపంలోని పంట పొలాలు, ఇతరాత్ర నీటి వనరులు ఉన్న చోటకు వెళ్లి తీసుకెళ్తున్నారు.

రక్షణ చర్యలతోనే మేలు..!

ఎండ భారినపడితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎండ భారినపడకుండా రక్షణ చర్యలు తీసుకోవడమే ఉత్తమమంటున్నారు. తగినంత నీరు తాగడం.. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, ఇతర రక్షణ కవచాలు ధరించడం వంటివి చేయాలని సూచనలు చేస్తున్నారు. అత్యవసరమైతే తప్పా ఎండలో బయటకు వెళ్లకూడదని చెబుతున్నారు.

ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

- జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



రంజాన్‌ను పురస్కరించుకుని నిర్మల్, భైంసా ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈద్గా, మసీదులలో ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 350 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అప్రమత్తంగా ఉండాలని, ప్రార్థనా సమయంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, భైంసా ఇన్ స్పెక్టర్ గోపినాథ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన సీసీఐ దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్దరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట "రిలే నిరాహార దీక్షలు" కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఉగాదిని పురస్కరించుకుని దీక్ష శిబిరం వద్ద ఉగాది పచ్చడితో పాటు గుడాలు ఆరగించారు. ఈ సందర్భంగా సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ప్రజలంతా పండుగ చేసుకున్న సందర్భంలో సీసీఐ సాధన కమిటీ పండుగను సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్షలో పాల్గొనడం జరిగిందన్నారు. సీసీఐని పున: ప్రారంభం చేసేంత వరకు దీక్ష కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇందులో కో-కన్వీనర్లు విజ్జగిరి నారాయణ, అరుణ్‌కుమార్, కొండ రమేష్, బండి దత్త్రాత్రి, వెంకట్ నారాయణ, ముడుపు ప్రభాకర్ రెడ్డి, జగన్, బొల్లు ఈశ్వర్, బొజ్జ ఆశన్న పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పండగ



ఆర్టీసీ బస్టాండ్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలుగు సంవత్సరం ఉగాది పండగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఒకరికొకరికి పంచుకున్నారు. ఉగాది నుంచి తెలుగు ఏడాది ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ చేనులో నాగలి పనులను ఆరంభించారు. జిల్లా మహారాష్ట్ర సరి హద్దున ఉండటంతో అక్కడి సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు వెదురు బొంగును నిలబెట్టి దానికి నూతన చీరతో పాటు చక్కర బిల్లలతో అలంకరించారు. ఆనందోత్సాహాల నుడుమ ఉగాదిని జరుపుకున్నారు.

తాంసి : తెలుగు సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం తాంసి, భీంపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో రైతన్నలు వేకువ జామున లేచి మొదట ఇంట్లో వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి చెనులోకి గొడ్డలి వెంట తీసుకవెళ్లి చెట్టు క్రింద గడ్డలి పెట్టి పూజలు నిర్వహించారు. వెంట తీసుకవెళ్లిన పెరుగు, గట్క అన్నం తిని ఇంటికి చేరుకొని ఉగాది పచ్చడి సేవించారు. వర్షాలు సమృద్ధిగా పాడిపంటలు పండాలని సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఆయా గ్రామాల్లో పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు.



ఆదిలాబాద్‌టౌన్ : సనాతన హిందూ ధర్మంలో ఉగాది పండగ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఇలాంటి సాంప్రదాయాలను రానున్న తరాలకు అందించేందుకు ఏటా పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం జరుపుతున్నామన్నారు. ఆదివారం వినాయకచౌక్‌లో ఉగాది పచ్చడిని స్థానికులకు అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో కుటుంబ సమేతంగా ఆనందంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, లింగారెడ్డి, రాజన్న, దమ్మపాల్, కొండాగణేష్, స్వరూప రాణి, బొడగం మమత, బట్టు సతీష్, కోరెడ్డి ప్రవీణ్, నవతే శ్రీనివాస్, మౌర్య సురేందర్, దయానంద్, మహేష్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఉగాది పచ్చడి పంపిణీ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక కూల్‌డ్రింక్‌లకు వ్యతిరేకమన్నారు. సహజ పానీయాలపై ఏటా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేస్తూ కూల్‌డ్రింక్స్ మానండి సహజ పానీయాలు సేవించండి అంటూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి ఉషన్న, కోశాధికారి లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గంగన్న, నారాయణ, లింగన్న, సంతోష్ కుమార్, నాగరాజు, రంజిత్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ హాజరై ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో తులతుగాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. ఇందులో నాయకులు రాంనాథ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, రాచకొండ సాగర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, విజయ్, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



తాంసిలో..



నిర్మల్‌లో..



ఆదిలాబాద్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన అంబటి లక్ష్మీకి మంజూరైన రూ.18వేలు, తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన డి.సురేష్‌కి



మంజూరైన రూ. 22వేల 500, గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన గొండ్ పంచపూలకు మంజూరైన రూ.30వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సురేందర్, దేవరావ్, నాయుకులు రమణగౌడ్, శ్రీను, వామన్, విష్ణు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com

సేవకు గుర్తింపుగా పురస్కారం

నవతెలంగాణ-నార్నూర్

సామాజిక సేవకు గుర్తింపుగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారం అందుకునట్టు కాంబ్లె మిలింద్ పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్‌లో నిర్వహించిన సాహితీ వేదిక దేవకియా సాహితీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన, ఉగాదికి పుస్తకావిష్కరణ కవి సమ్మేళనంలో భాగంగా మండలం నుంచి ఆయన సేవలను గుర్తించి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతులు మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. సమాజంలో మంచి సేవలను అందిస్తున్న వారిని గుర్తించి వారిని సత్కరించి ప్రశంస పత్రాలను అందించడం జరుగుతుందని ఉట్నూర్ సాహితీ వేదిక, దేవకియా సాహితీ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పవన కోకిల బంకట్ లాల్ తెలిపారు.



ఘనంగా ఉగాది పండుగ వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్ : ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్పీ అఖిల్ మహాజన్ సతిసమేతంగా పురాతన ఆలయం గోపాలకృష్ణ ఆలయంలో పూజలు చేశారు. ఎస్పీకి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మఠాధిపతి యోగనంద సరస్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించి, పట్టు వస్త్రాలను అందించారు. మఠం చరిత్రను వివరించారు. అనంతరం సనాతన హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చడి పంపిణీలో పాల్గొన్నారు. ముందుగా ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, గెడం మాధవ్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్ ఎస్పీ దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ కూడా సుఖ సంతోశాలతో, ఆయురారోగ్యలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సమితి కార్య నిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, సంజీవ్, రాజు పాల్గొన్నారు.

హిందూ వాహిని ఆధ్వర్యంలో...

శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని హిందూ వాహిని ఏదులాపురం శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదివారం వినాయక్‌చౌక్‌లో గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి చేతుల మీదుగా హిందూ వాహిని జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా ఉగాది పచ్చడి వితరణ చేశారు. పకృతిలో వచ్చే మార్పులను స్వాగతిస్తూ ప్రకృతికి అనుగుణంగా జరుపుకునే ఉత్సవం ఉగాది ఉత్సవమని తెలియజేస్తూ ఉగాది పచ్చడి వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేందర్, నవనీత్, చాణక్య, సాయి, అక్షయ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని లక్కారం గ్రామపంచాయతీలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉగాది సంబరాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నుండే మనకు నూతన సంవత్సరం మొదలవుతుందని, రైతులు పొలంలోకి వెళ్లి సంతోషంగా ఉగాది పండుగలను కుటుంబంతో సహా ఘనంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో...

భగవాన్ నామస్మరణతో షడ్రుచుల సమ్మేళనంతో శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ రామ మందిరంలో ఆదివారం ఉగాది పచ్చడిని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి మానసరాజేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభను తెస్తూ, కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా సమగ్రాభివృద్ధికి దోహదపడాలన్నారు. సమృద్ధిగా వర్షాలు కురువాలని, పంటలు బాగా పండాలని, రైతులు బాగుండాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలన్నారు.



ఉట్నూర్

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని మాన్కాపూర్, మహాగావ్, భీంపూర్, మలంగి, ఉమ్రి, గంగాపూర్, గుండాల, తాడిహత్నూర్, నాగల్‌కొండ, గుంజాల, జామడ, తదితర ఆదివాసీ గిరిజన గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. రైతులు ఉదయాన్నే పొలంలో నూతన పనులు ప్రారంభించి, పూజలు చేశారు. నవధాన్యాలు, రకరకాల పిండి వంటలు చేసి బసవన్నకు నైవేద్యం అర్పించారు. మండల కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా హనుమాన్ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ విశ్వావసు నామ సంవత్సర నూతన పంచాంగ శ్రవణం విన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ ఎంపీపీ రూపదేవ్ పటేల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, నాయకులు రాథోడ్ ఉత్తం, బిరుజులాల్, ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, దిగంబర్ ఆడే, రాథోడ్ దత్తారాం, పుష్కర్ జ్ఞానోబా, కొమ్మువార్ గజానంద్, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాష్, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి) పల్సి, సొనారి అన్ని గ్రామాల్లో ఆదివారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున రైతులు, తమ తమ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి నూతన పనులను ప్రారంభించారు. అనంతరం అక్కడే ఇంటి నుంచి తెచ్చుకున్న పిండి వంటల భోజనాలు చేశారు. అదే విధంగా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ఆయా కుల సంఘాల భవనంలో పూజారులచే పంచాంగ పఠనం రైతుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ ఏడాదిలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, రైతుల కష్టాలు తీరాలను మొక్కుకున్నారు.

నిర్మల్‌టౌన్ : నిర్మల్లోని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ భవనంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణా రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విశ్వావసు నామ ఉగాది కవి సమ్మేళనం అలరించింది. ఇందులో జిల్లా వ్యాప్తంగా యాభై ఒక్కటి మంది తెలుగు, ఉర్దూ కవులు పాల్గొన్నారు. ఈ కవి సమ్మేళనంలో వివిధ కవులు తమ కవిత గానాన్ని వినిపించారు. ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసా పత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జే.లక్ష్మణ్, నిర్మలభారతి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి పరమేశ్వర్, బి.వెంకట్, డా.అప్పాల కావేరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. అప్పాల చక్రధారి, తెరవే ఉపాధ్యక్షులు డా.ఉప్పు కృష్ణంరాజులు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. కవులు చట్ల గజ్జారాం, డా.దామెర రాములు, బొందిడి పురుషోత్తంరావు, సీనియర్ కవి తుమ్మల దేవరావు, పోలీస్ భీమేష్, అంబటి నారాయణ, దీపక్‌రెడ్డి, రెడ్ల బాలాజీ, పత్తి శివప్రసాద్, తోడిశెట్టి రవికాంత్, దేవీప్రియ, స్వాతి, సయ్యద్ హుస్సేన్, అన్సార్ అహ్మద్, ఫహీం మాజిద్ పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్ : ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు



కుభీర్ : ఉగాది పురస్కరించుకొని వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు

సమాజంలో కవులు, రచయితల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

కవులు, రచయితలు అనేక పుస్తకాలను రాసి సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలపై ప్రజల్లో చైతన్యాన్ని నింపడంలో విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ సాహితీ వేదిక, దేవకీయా సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి, అనేక విషయాలపై అవగాహన కల్పించడంలో కవులు, రచయితల పాత్ర కీలకమైందని అన్నారు. బాధ్యత గల పౌరులుగా కవులు, రచయితలు తమ పుస్తకాల ద్వారా సమాజాన్ని మెలకొల్పి, సమాజ హితం కోసం పాటు పడటం అభినందనియమన్నారు. అనంతరం కవులను, రచయితలను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సాహితీ వేదిక సభ్యులు, దేవకీయా సాహితీ సేవా ఫౌండేషన్ సభ్యులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్స్ వద్దు, సహజ పానీయాలు ముద్దు



నవతెలంగాణ-నిర్మల్

జన విజ్ఞాన వేదిక నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో గాంధీ పార్క్ వద్ద కూల్ డ్రింక్స్ వద్దు, సహజ పానీయాలు ముద్దు అనే నినాదంతో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు డా.మురళీధర్ మాట్లాడారు. అనేక వ్యాధులకు కారణమవుతున్న శీతల పానీయాలను మాని ఆరోగ్యాన్నిచ్చే సహజపానీయాలైన లస్సీ, షర్బత్, చెరుకు రసం, అంబలి, ఫాలుధ వివిధ పండ్ల రసాల పానీయాలను తాగాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూల్ డ్రింక్స్‌లో ఉండే అధిక మోతాదులో ఉండే క్రిమి సంహారక మందుల వల్ల, చక్కెర పదార్థాలు, కృత్రిమ రంగులూ, ఆమ్లాలు, ఇతర రసాయన పదార్థాల వల్ల క్యాన్సర్, మధుమేహం, ఉబ్బసం, ఊబకాయం, ఎముకలు బోలుగా మారడం, సంతానోత్పత్తి క్షీణించడం లాంటి సమస్యలు వస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంకం గంగాధర్, గౌరవాధ్యక్షులు ఆకుల సుదర్శన్, కొండా రాములు, అనంత విశ్వేశ్వర్, ఉపాధ్యక్షులు నారాయణ వర్మ, ముత్తన్న, గజపల్లి నర్సయ్య దేవేందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్-100పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై అప్పారావు ప్రజలకు సూచించారు. ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గిర్నూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాల్సి వస్తే, వెంటనే డయల్-100కు కాల్ చేయాలని చెప్పారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే1930కు కాల్ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, రైతులు భూమిని తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే సమయంలో మోసపోకుండా ఉండేందుకు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవహగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

దేశంవైపు చూస్తున్న ప్రపంచ దేశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచానికి జ్ఞానం అందించిన భారత దేశం వైపు నేడు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని, గ్రహాల గురించి వాటి గమనం, దూరం గురించి ఏండ్ల క్రితం మనం చెప్పామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో వినాయక్‌చౌక్ నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ముందుగా పరమహంస రామకృష్ణ చిత్రపటం, వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ప్రజలకు ఉగాది పచ్చడితో పాటు గుడాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రహాలు ఎన్ని ఉన్నాయి. వాటి గమనం గురించి సనాతన ధర్మం ఎప్పుడో చెప్పిందన్నారు. దాని కారణంగా నేడు ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతి, పండుగలవైపు చూస్తున్నారన్నారు. పండుగల గురించి చర్చలు, రీసెర్చ్ చేస్తున్నారన్నారు. మన పండుగలు, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్కే సేవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, లెనిన్, బీజేపీ పట్టణాధ్యక్షుడు వేదావ్యాస్, మాజీ కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, రాజేష్, జోగు రవి, లాలామున్న, నాయకులు విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం ఇంటర్‌నేషనల్ వాసవి క్లబ్ ఆదేశాల మేరకు ఖానాపూర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల గంగాయిపేట గ్రామంలో నిరుపేద ఇటుక బట్టి మహిళ కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిప్యూటీ గవర్నర్ మహజన్ జితేందర్, ఖానాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు చిటికెశి రవీందర్, ప్రధాన కార్యదర్శి చిటికెశి సతీష్ కుమార్, కోశాధికారి కూరగాయల సతీష్ కుమార్, నిర్మల్ జిల్లా మాజీ కోశాధికారి పాలెపు సుదర్శన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మహజన్ జలంధర్ గుప్తా, వాసవి క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి సామ లక్ష్మీనారాయణ, కటకం వేణుగోపాల్, కట్కం అశోక్ కుమార్, రుద్రవార్ సాయి చరణ్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసి మెలిసి పని చేయాలని ఆసిఫాబాద్ నియోజక కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కార్యకర్తలతో జైబాపు జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, ప్యాక్స్ డైరెక్టర్ జాదవ్ కైలాష్, దుర్గే కాంతారావ్ ఉన్నారు.

పండుగల నేపథ్యంలో మార్కెట్‌లో సందడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉగాది, రంజాన్ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ ప్రాంతం రద్దీగా దర్శనమిచ్చింది. రెండు పండులతో పాటు ఆదివారం సండే బజార్‌కావడంతోకొనుగోలు చేయడానికి జనాలు పెద్ద ఎత్తున వచ్చారు. వ్యాపారాలు అధికంగా జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం ఉగాది కావడంతో పూజ సామాన్లు కొనుగోలు చేశారు. నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగ జరగనున్న నేపథ్యంలో సేమియాలు, డ్రై ఫ్రూట్స్ కోసం ప్రత్యేకంగా వెలసిన దుకాణాల్లో ముస్లిం సోదరులు సామాగ్రి కొనుగోలు చేశారు. అదే విధంగా ఆడవాళ్లు వారికి బట్టలతో పాటు మ్యాచింగ్ గాజులు, ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

నేడే ఈద్ ఉల్ ఫితర్ పండుగ వేడుకలు

- ముస్తాబైన మసీద్‌లు
- సిద్ధమైన ఈద్గా మైదాన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలు నెల వంక కనిపించడంతో ఈనెల 2న తెల్లవారుజామున సహేర్ తో ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో రంజాన్ మాస దీక్షలు ముగియగా సోమవారం ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకుంటారు. శాంతి, సామరస్యాలు, శాంతియుత జీవన విధానం, పరమత సహనం, ఓర్పు, నిజాయితీ తదితర మానవత్వంతో జీవించే విధానాలకు మార్గనిర్దేశం చేసిన దివ్య ఖురాన్ ఈ నెలలోనే ఆవిష్కృతమైందని విశ్వసించే ముస్లింలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను ఆచరించారు. రోజు వారీగా 5 పూటలా నిర్వహించి, ప్రార్థనలకు తోడు తరావి ప్రార్థనలు చేస్తు దివ్య ఖురాన్ పఠనం చేపట్టారు. కాగా సోమవారం రంజాన్ ప్రార్థనలకు పట్టణంలోని ఈద్గా మైదాన్ని సిద్ధం చేస్తున్నారు. ఉదయం 7.30 నిమిషాలకు ఈద్ నమాజ్ ఉండటంతో మైక్ సెట్లు, ఇతర సౌకర్యాలను కల్పించారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ...

ఎస్పీ అఖిల్ మహాజన్ ఈద్గా మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ కూడా పొరపట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. నమాజ్ సమయంలో ట్రాఫిక్ మళ్లింపు, ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. పట్టణంలో 250 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి బందోబస్తు ప్రక్రియ మొదలవుతుందని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణకర్, ఆర్ఐ మహేందర్, సిబ్బంది ఉన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రభుత్వం గోరు బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఖానాపూర్ మండల బంజారాల ఆధ్వర్యంలో తెలంగాణ తల్లీ చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ జాతీయ ఉపాధ్యక్షులు ఐఏఎస్ కొప్పుల రాజు, ట్రైకార్ చైర్మెన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మెన్ బాణావత్ గోవింద్ నాయక్, మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజురా చిన్నం సత్యం, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు జాదవ్ వెంకట్‌రావు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బుక్యా గోవింద్ నాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కడార్ల గంగ నర్సయ్య, బంజారా నాయకులు జరుపుల రాజేశ్వర్ రాము, గుగ్లావత్ రాజేందర్ నాయక్, బాణావత్ రాంచదర్ నాయక్, నెహ్రూ నాయక్, ప్రేందాస్ నాయక్, ప్రేమ్‌సింగ్ నాయక్, రాము జరుపుల బాపూరావు నాయక్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : బంజారా ప్రజలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించడం సంతోషకరమని అల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ భీమ్‌రావు, లంబాడా జేఏసీ నాయకులు రాంకిషన్, రామారావు అన్నారు. ఆదివారం ఉట్నూర్ పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద సీఎం, మంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో 40 లక్షలకు పైగా ఉన్న లంబాడి గిరిజనుల భాషను గుర్తించి ప్రత్యేక హోదా కోసం తీర్మానించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. గోర్ బోలి భాషను పాఠ్యపుస్తకంలో పొందు పరచి, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ను కల్పించాలన్నారు. అనంతరం శ్యామ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బంజారా, లంబాడి ప్రజల గోర్ బోలి భాషను గుర్తించినందుకు ముఖ్యమంత్రితో పాటు మంత్రి, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్‌లో వెంటనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్, సుధాకర్, ప్రకాష్, రమేష్, వసంతరావు, గణేష్, జైవంత్‌రావు, గంగారాం నాయక్, సైలెందర్, మధుకర్, మహేందర్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బంజార సంఘం నాయకులు

రంజాన్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లాలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లింపు చేయడం జరుగుతుందని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రధాన చౌరస్తాలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రజలందరు సోదర భావంతో తమ పండగలు సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ మొదలగు వాటిలో ఒకరిని కించపరిచే విధంగా పోస్టులు చేయరాదని ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టరాదని, సామాజిక మాధ్యమాలపై పోలీసు నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతి స్థాపన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన



పవిత్ర రంజాన్ పండుగను ప్రతీ ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాలని గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వసీం ఆకాంక్షించారు. శనివారం రాత్రి పేద ముస్లిం కుటుంబాలకు చెందిన 45 మందికి రంజాన్ తోఫా కిట్స్ పంపిణీ చేశారు. నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఒక్కొక్కరికి 20 కేజీ సన్న బియ్యంతో పాటు 11 రకాల నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వసీం మాట్లాడుతూ రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరపుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి రంజాన్ పండుగకి తోఫా పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మొయిజ్, అద్నాన్, అబ్దుల్ హాది ఉన్నారు.

'రెవెన్యూ' బలోపేతం

- పల్లె పాలన మరింత మెరుగు
- గతంలో వీఆర్వో వీఆర్ఏలుగా పనిచేసిన వారికి అవకాశం
- ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ
- రాత పరీక్ష ద్వారా ఎంపిక
- ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- నిరుద్యోగులు చిగురించిన ఆశలు



కెరమెరి మండలంలోని అనార్‌పల్లి గ్రామం

నవతెలంగాణ కెరమెరి

గ్రామ పాలనను గాడిలో పెట్టేందుకు పలు మార్పులకు ప్రభుత్వం స్వీకారం చుడుతోంది.రాష్ట్రంలో ఉన్న గ్రామ పాలాధికారి పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇప్పటికే రద్దు అయిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థల స్థానంలో గ్రామంలో అన్ని రెవెన్యూ వ్యవహారాలను చూసేందుకు గ్రామ పాలనాధికారుల జీపీఓ వ్యవస్థను తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టింది. కొద్దిరోజుల్లో ఈ ప్రక్రియను గాడిలో పెట్టేందుకు వడివాడిగా అడుగులు పడుతున్నాయి. తాజాగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం త్వరలోనే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పాలన అధికారిని నియమించనున్నారు.

జిల్లాలో 434 జీపీఓ

ప్రభుత్వ యోచన ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 434 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ పాలనాధికారుల నియామకాలు జరగనున్నాయి. గ్రామ పాలనాధికారుల నియామకం కోసం ఇప్పటికే చర్యలు చేపట్టిన ప్రభుత్వం 2021లో 103మంది వీఆర్‌ఏ, 317మంది వీఆర్‌ఓల నుంచి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. త్వరలో ధరణి స్థానంలో భూ భారత తీసుకువస్తున్న సర్కార్ ఈ బాధ్యతల నిర్వాహణను జీపీఓలకు అప్పగించనుంది. కొత్తగా అమలు చేయనున్న భూభారతితో పాటు గ్రామంలో రెవెన్యూ పనులతో పాటు కొన్ని పంచాయతీ శాఖకు సంబంధించిన వ్యవహారాలను కూడా జీపీఓలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు జీపీఓల నియామకం కోసం కసరస్తు చేస్తుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఆప్షన్లు కూడా తీసుకుంది. ఏ రెవెన్యూ డివిజన్ ఏ మండలం ఏ గ్రామంలో పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఎక్కడ పని చేశారు. అనే సమాచారం కూడా దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం తీసుకుంది. దరఖాస్తుదారులకు రాత పరీక్ష నిర్వహించి ఇందులో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయనుంది. ఎంపిక చేసిన వారికి కొత్తగా అమలు చేయనున్న భూభారతితో పాటు ఇతర కీలక అంశాలపై కొద్దిరోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారం

కొత్తగా నియమించే గ్రామ పాలనాధికారులతో రెవెన్యూ వ్యవస్థ క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం కానుంది. గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేయడంతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలహీనపడింది. అన్ని వ్యవహారాలు కూడా తహసీల్దార్ ఆపై అధికారులు చూడాల్సి వచ్చింది. క్షేత్రస్థాయిలో సమాచారం కూడా సరిగా అందుబాటులో ఉండడం లేదు. ఇప్పుడు ప్రభుత్వం గ్రామ పాలంలో గ్రామ పాలన అధికారులను నియమించడంతో గ్రామంలో రెవెన్యూ సంస్థలు త్వరగా పరిష్కారం అవకాశం ఉంది. అనేక గ్రామాల్లో రెవెన్యూ రికార్డులు సరిగా లేక సరిహద్దుల వివాదాలు, మ్యాపులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో రెవెన్యూ వివాదాలు పెరుగుతున్నాయి. అంతా ఆన్‌లైన్ చేయడంతో మాన్యువల్ రికార్డులు అందుబాటులో లేక బాధితులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. అసలు రికార్డులు పోవడంతో పొరపాట్లు ఎక్కడ జరిగాయి. సరి చూసుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. భూభారతి అమల్లోకి తెచ్చి మ్యానువల్ రికార్డులు కూడా పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్వహణ కోసమే ఇప్పుడు గ్రామ పాలనాధికారుల నియమకాలు చేపడుతుంది. గ్రామంలో ఆదాయ కుల జననం మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర రెవెన్యూ సేవలు గ్రామ పాలనా అధికారులకు అప్పగించనున్నారు. అలాగే రేషన్ కార్డుల జారీ వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారులు ఎంపికలో కూడా వీరే కీలకం కానున్నారు.

రాత పరీక్ష పై అనాసక్తి

ఇదిలా ఉంటే గ్రామ పలనాధికారి పోస్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు రాత పరీక్షపై అనాసక్తి చూపుతున్నట్లు తెలిసింది. గతంలో తాము వీఆర్‌ఓ, వీఆర్‌ఏ పోస్టుల్లో పనిచేసినందున మళ్లీ రాత పరీక్ష ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత పరీక్షల్లో అర్హత పొందకుండా ఇది తమకు అవమానకరమైన అని భావనతో ఉన్నారు. దీంతో కొందరు అసలు దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం.

నిరుద్యోగుల్లో ఆశలు

గ్రామ పాలనదికారి పోస్టులు భర్తీ కాకుండా నోటిఫికేషన్ ఇచ్చి కొత్తగా నియమకాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. దీంతో నిరుద్యోగులు ఆశలు చిగురించాయి. గ్రామ పాలనాధికారి పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలని నిబంధన పెట్టారు. దీంతో వారు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

పీటీజీలుగా గుర్తించేందుకు ప్రయత్నం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-బెజ్జూర్

మనేవాళ్లను పీటీజీలుగా ప్రభుత్వం గుర్తించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ భరోసా ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మన్నేవార్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. మన్నేవర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కృతజ్ఞతగా ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి ధన్యవాదలు తెలిపారు. గతంలో పీటీజీలుగా ఉండేవారని ఈ మధ్యకాలంలో మన్నేవర్లను పీటీటీజీల జాబితా నుండి తొలగించడం బాధాకరమన్నారు. వెనుకబడిన తెగకు చెందిన మన్నేవార్లను పీటీజీలుగా గుర్తించే వరకు తన ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అంతకుముందు బెజ్జూర్ పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ఉగాది పచ్చడి స్వీకరించారు. పోచమ్మ ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎలుకపెల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అక్కడి నుంచి పాపన్నపేటలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరానికి భరోసా ఇస్తు ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ మనోహర్ గౌడ్, సామల తిరుపతి, దిగంబర నీలేష్, సంతోష్, భాస్కర్, రాజు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మన్నేవార్ సేవా సంఘం నాయకులు

ఘనంగా సామల సదాశివ సాహితీ పురస్కార ప్రధానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం డాక్టర్ సామల సదాశివ సాహితీ పురస్కారం-2024 ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు సాహితీ సదస్సు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవి, రచయిత సామల రాజవర్ధన్ హాజరయ్యారు. ఈ పురస్కారాన్ని గణపతిశర్మకు అందించారు. ఈ సందర్భంగా రాజవర్ధన్ మాట్లాడుతూ తెలుగు సాహితీ సదస్సు ఈ అవార్డును గణపతి శర్మకు అందించడం ఆనందంగా ఉందని అన్నారు. గణపతి శర్మ చేసిన సాహిత్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రశంసించారు. గట్టు గణపతి శర్మ రచించిన విరాటపర్వం ద్విపదకావ్యాన్ని శతావధాని, చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి పట్వర్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్వర్ధన్ మాట్లాడుతూ గణపతి శర్మ సంస్కృతం, తెలుగు భాషల మధ్య వారధిగా నిలిచారని ప్రశంసించారు. తేలు శ్రీలత రచించిన నీలవేణి శతకాన్ని డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ ఆవిష్కరించగా, కవి, పండితుడు కొమెర రాజేశ్వర్‌రావు రచించిన సీతా చరితం గ్రంథాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం ఆవిష్కరించారు. పెండ్యాల కిషన్‌శర్మ రచించిన శ్రీదేవి వైభవం గ్రంథాన్ని కవి, పండితుడు ముద్దు రాజేంద్రప్రసాద్ సమీక్షించారు. దీనికి ముందు ఇటీవల మరణించిన తెలుగు సాహితీ సదస్సు అధ్యక్షుడు లక్ష్మీరాజయ్య ఆత్మకు శాంతి కోసం నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహితీ సదస్సు క్రియాశీలక కార్యదర్శి కటకం మధూకర్, ప్రధాన కార్యదర్శి మామిడాల తిరుపతయ్య, సభ్యులు తౌటం శ్యాంసుందర్, మండల విద్యాశాఖాధికారులు వాసాల ప్రభాకర్, తోట రమేష్, డి వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, తెలుగు పండితులు శంకర్, సత్యనారాయణగౌడ్, విజయారావు పాల్గొన్నారు.

కేస్లాపూర్ ఘటన దుండగులను శిక్షించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజనుల దైవమైన కేస్లాపూర్ నాగోబా దేవత ఆవరణలో ఉన్న హీరా సుఖ గురుజండాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాజ్‌గోండు సేవా సమితి కన్వీనర్ సిడం అర్జు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెండాలను ధ్వంసం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన అంశమని అన్నారు. దుండగులను వెంటనే గుర్తించి గోండు సమాజానికి చెందిన వ్యక్తులు ఇటువంటి ఘాతకానికి పాల్పడితే వారిని ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ హోదా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందూరు సుధాకర్, మండల కార్యదర్శి టేకం గంగారాం పాల్గొన్నారు.

మహంకాళీ జాతరకు తరలిరండి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనకదుర్గా దేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో ఏప్రిల్ 12, 13 తేదీలలో జరిగే మహంకాళీ అమ్మవారి జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ కోరారు. ఆదిఆవరం జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ముందుగా నిర్వాహకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి జాతర వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్, కమిటీ సభ్యులు కావుడే సంతోష్, శ్రీకర్ పాల్గొన్నారు.

సేవాలాల్ నామస్మరణతో మార్మోగిన శంకర్ లొద్ది

నవతెలంగాణ-కెరమెరి

ఉగాది పర్వదినం సందర్భంగా తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులోని శంకర్‌లొద్ది శైవక్షేత్రం ఆదివారం సేవాలాల్ నామస్మరణంతో మార్మోగింది. ప్రతి ఏటా ఉగాది సందర్భంగా మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో వెలసిన శైవ క్షేత్రానికి లంబాడీల ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ ప్రేమ్‌సింగ్ మహారాజ్ తపస్సు చేసిన ఆధ్యాత్మిక ప్రదేశం కావడంతో సేవాలాల్ దీక్ష స్వీకరించిన బంజారాలు శైవ క్షేత్రంలోని శివలింగాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శంకర్ లొద్ది గ్రామానికి సమీపంలోని వాగు తీరంలోని ఎత్తయిన కొండగుహలో వెలసిన శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

బంజారా లంబాడీల దీక్ష గురువు ప్రేమ్ క్షణక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడే ప్రేమ్ సింగ్ మహారాజ్ తపస్సు చేసిన ప్రదేశం కావడంతో ప్రసిద్ధి చెందింది. క్షేమ క్షేత్రానికి తరలివచ్చిన భక్తులతో కలిసి ప్రేమ్ సింగ్ మహారాజ్ భోగ్ బండార్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శంకర్‌లొద్ది ఉగాది వేడుకల్లో అపశృతి

- వాగులో పడి యువకుడి మృతి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని శంకర్ లొద్దిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వాగులోపడి యువకుడు మరణించిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్(18) బొలెరో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా శంకర్ లొద్దిలోని శైవ క్షేత్ర దర్శనానికి వెళ్ళాడు. శైవ క్షేత్రం చేరువలోని వాగులో పుణ్య స్నానం ఆచరించేందుకు నదిలోకి దూకి ఈదు కుంటూ బయటకు వచ్చాడు. రెండోసారి ఎత్తులో ఉన్న బండరాయి పైనుంచి నదిలోకి దూకాడు. నది నీటిలోని బండరాళ్ల మధ్య కాలు ఇరుక్కోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించి మృతుడి తండ్రి ఉత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



నవతెలంగా-సిర్పూర్(టి)

మండలం టోంకిని గ్రామ ప్రఖ్యాత సిద్ధి హనుమాన్ ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామిని వేడుకున్నారన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సిర్పూర్ బీజేపీ మండల అధ్యక్షురాలు లావణ్య, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మారుతి, మాజీ సర్పంచ్ గురుదాస్, పవన్‌సోని, శంకర్, అశోక్ ఆర్య దివాకర్ మహేష్, రంగన్న, పాండు, ప్రకాష్ పాల్గొన్నారు.

గోలేటి హనుమాన్ ఆలయంలో కలశ పూజ



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి శ్రీ హనుమాన్ మందిరంలో ఆదివారం కలశ పూజ నిర్వహించారు. హనుమాన్ సేవలాల్ భక్తులు పురవీధుల గుండా కలశంతో పుర విధుల గుండా తిరుగుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి కలశాన్ని ఆలయంపై ఆవిష్కరించారు. హనుమాన్ సేవలాల్ భక్తులు గ్రామ ప్రజల సమక్షంలో వేదపండితుల సమక్షంలో అంగరంగ వైభవంగా మంత్రోచ్చరణల నడుమ కలశ పూజ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ సేవలాల్ భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశ్వావసు నామ సంవత్సరం కలిసి రావాలి

- ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి
- ఎమ్మెల్యే కోవలక్ష్మి
- జిల్లాలో ఘనంగా ఉగాది వేడుకలు
- పల్లెల్లో ప్రారంభమైన పొలం పనులు



ఆసిఫాబాద్ : ఎమ్మెల్యే నివాసంలో ఉగాది పూజలు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

విశ్వావసు నామ సంవత్సరం ప్రజలందరికీ కలిసిరావాలని సుఖశాంతులతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కోవలక్ష్మీ ఆకాంక్షించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆమె నివాసంలో భర్త సోనేరావు, కోవలక్ష్మి ఇంట్లో పూజలు కోవా సాయినాథ్ దంపతులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వారికి ఉగాది పెద్ద పండుగని అన్నారు. ఈ సంవత్సరంలో రైతులు కర్షకులకు కార్మికులకు అన్ని విధాలా కలిసి రావాలన్నారు. సమాజంలో అన్ని వర్గాలు అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. ఉగాది అంటే రైతన్న పొలం పనులు ప్రారంభించే సమయమని ఈ సంవత్సరం రైతన్నకు అన్ని విధాలా కలిసి రావాలన్నారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, అలిబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో

జిల్లా కేంద్రంలోని ఉత్తర నది తీరంలో గల శ్రీ కేస్లాపూర్ వీరంజనేయ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు, జిల్లా అధ్యక్షుడు వొజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధినిధులు వెంకటేశ్వర్, పిన్న వివేక్, శ్రీనివాస్, రాకేష్, కరణ్, సతీష్, డాక్టర్ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్, ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరగడ మారుతి పటేల్, జిల్లా ప్రచార కార్యదర్శి మిట్ట తిరుపతి, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బట్టుపల్లి ప్రశాంత్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కోట వెంకన్న, నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా నాయకులు జూలూరి శంకర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు సంజీవ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సెండే నామ్‌దేవ్, అరె సంక్షేమ సంఘ నాయకులు కొలె భికాజీ, గేడెకర్ సంతోష్, గుండి మాజీ సర్పంచ్ షిండే దత్తు, కాంగ్రెస్ నాయకులు వసంత్ రావు, అసద్, మహేష్, అశోక్, రామచందర్, సురేష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : పచ్చడి పంపిణీ చేస్తున్న బీసీ నాయకులు

శివాలయంలో పంచాంగ శ్రవణం

సందీప్ నగర్‌లోని శివాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని పంచాంగ శ్రవణం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంవత్సర కాలంలో జరిగే కార్యక్రమాలు, మంచి ముహూర్తలను వేధపండితులు వివరించారు.

ఆర్టీసీ డిపో పరిధిలో

ఆర్టీసీ డిపో పరిధిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొని సిబ్బందికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అందరికీ కలిసి రావాలని ఆకాంక్షించారు. డిపోను లాభాల బాటలోకి తీసుకు వెళ్ళడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు.

పల్లెల్లో ప్రారంభమైన పొలం పనులు

ఉగాది పండుగను పురస్కరించుకొని పల్లెల్లో కొన్ని చోట్ల దుక్కి దున్నే పనులు రైతులు ప్రారంభించారు. మండలంలోని మోతుగూడ రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించి దుక్కులు దున్నారు. పంటలు సమృద్ధిగా పండి మంచి దిగుబడి రావాలని కోరుకున్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు జమల్‌పురి సుధాకర్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రెబ్బెన : విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ఖైరిగూడ ఉపరితల గని ఆవరణలో గల శ్రీ కనక దుర్గా దేవి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకిఉగాది పచ్చడి, భక్షాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ్ భాస్కర్ రెడ్డి, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ నరేందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్, సేఫ్టీ ఆఫీసర్ నారాయణ్, వేణు, ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, సెక్రటరీ మారం శ్రీనివాస్, గోలేటి, టెంపుల్ కమిటీ సెక్రటరీ చంద్రశేఖర్, కిరణ్, మాల ఓదెలు, సత్యనారాయణ, నరిష్ పాల్గొన్నారు.



రెబ్బెన : ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ సంఘం భవన నిర్మాణానికి సహకరించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కోరారు. ఈ మేరకు సీనియర్ సిటిజన్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని సీనియర్ సిటీజన్‌కు భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బొజ్జపటేల్ సీనియర్ సిటిజన్ సంఘ భవనానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మూల భాస్కర్‌గౌడ్, లెక్కల మల్లయ్య, కుకటికారు బుచ్చయ్య పాల్గొన్నారు.

మేడి నర్సయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని షెట్‌పల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మేడి రవి తన తండ్రి మేడి నర్సయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇందారం-శివ్వారం ప్రధాన రహదారిపై టేకుమట్ల-షెట్‌పల్లి గ్రామాల మధ్యన గ్రామస్థులతో కలిసి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చలివేంద్రం ఏర్పాటు చేశారు. రహదారి మీదుగా ప్రయాణించే వాహణదారులకు చల్లటి నీటితో పాటు మజ్జిగ పంపిణీ చేసిన ఆయన వేసవికాలం పూర్తయ్యే వరకు చలివేంద్రం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

ఉగాది పండగ వేడుకలను మండల ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, తపాలపురం గ్రామంలో ఉన్న శివాలయంలో, తిమ్మాపూర్ మందపల్లి, పొన్కల్ గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు పంచాంగ శ్రవణం పాటించారు. ఆలయాల్లో ఇళ్లలో ఉగాది పచ్చడి చేసుకున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర పీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని ప్రజలకు అందించినట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు

మంచిర్యాల : ఉగాది పండుగను పురస్కరించుకొని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ దంపతులు ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా ముందుగా దేవత మూర్తులకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు ప్రజలందరికీ శుభం కలగాలని, వారి జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఆయన ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ



జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెలే, కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఆదివారం ఉగాది పండగను పురస్కరించుకొని పలు సంఘాల నాయకులూ ఉగాది పచ్చడి , బూరెలు పంపిణి చేశారు. ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ప్రతి ఒకరు సంతోషకర వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని కోరారు. వాకర్స్ క్లబ్ అద్వర్యంలో ఉదయం నిర్వహించిన వేడుకల్లో వాకర్స్ అందరూ స్వయంగా ఉగాది పచ్చడి తయారుచేసుకొని స్వీకరించారు. అనంతరం ఒకరికి ఒకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

జైపూర్ : ఉగాదితో మొదలవుతున్న తెలుగు సంవత్సరంలో పాడి పంట అభివృద్ధి చెంది ప్రజలంతా సుఖ:సంతోషాలతో వర్ధిల్లాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఉగాది పర్వదినాన్ని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వేదపండితుల పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విదాలుగా అభివృద్ధి చేస్తానని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ నెరవేరుస్తానని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఈ సందర్భంగా తెలిపారు.

ఉగాది సాహితీ సమ్మేళనం

లక్షెట్టిపేట : శాలివాహన శకం 1947వ సంవత్సరం విశ్వావసునామ ఉగాది పండుగ సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సాహితీ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం స్థానిక గుడ్ షెఫర్డ్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కందుల తిరుపతి అధ్యక్షత వహించగా, కాసం కుమార స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో కవులు రాచకొండ శ్రీనివాస్, లేదాళ్ళ రాజేశ్వరరావు, కాసం కుమార స్వామి, గుండ ప్రభాకర్, పురం సుధాంశ్ చదివిన కవితలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా లేదాళ్ళ రాజేశ్వరరావు రచించిన కవితా సంపుటి రంగుపూల బిముఖాలు, ఐవీ సుబ్బాయమ్మ రచించిన సదా స్మరణీయులు అనే వ్యాస సంపుటిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రధాన కార్యదర్శి నూటెంకి రవీంద్ర సమన్వయ కర్తగా వ్యవహరించారు.







అంబేద్కర్ జయంతి పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ సంఘాల నాయకులతో కలసి జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఏప్రిల్ 14 ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో మేధావులు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, కామరాజ్ వాగ్మారే, భీంఆర్మీ నాయకులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎమ్మెల్యే ఏలేటి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పీఎం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు రాచకొండ సాగర్, ఓఎస్ఓఈ కన్వీనర్ అచ్యుత్‌రావ్, జమాల్, రూరల్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు రంజిత్, విజయ్, నర్సయ్య, రవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ, కాంగ్రెస్ నాయకులు జిల్లాలో హోర్డింగ్‌లకే పరిమితం కాకుండా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణానికి చెందిన రణదీవెనగర్ , ఇంద్రానగర్, ఖుర్షీద్‌నగర్, హమాలీవాడాలకు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ యువకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడాల్సిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలపై బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ప్రతి కాలనీలో సీసీరోడ్లు, పెద్ద నాళాలు, పలుచోట్ల ఆలయాల నిర్మాణాలు, మందిరాల వద్ద షెడ్లు, ఆరోగ్య రీత్యా దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, కోవా రవి, దమ్మపాల్, కొండ గణేష్, అడప తిరుపతి, అన్నెలా వసంత్, ఉగ్గే విట్టల్, మహేష్, నీలేష్, రాజు సాయికుమార్ విక్రమ్ పాల్గొన్నారు.

రామాలయంలో హరినామ సంకీర్తనలు

● శ్రీరామ నవమి వరకు కొనసాగనున్న భజన సప్తాహ



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో గల కోదండ రామాలయంలో నిర్వీరామ హరినామ సంకీర్తనలు మొదలయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం నిర్వీరామ హరినామ సంకీర్తనలు ప్రారంబించారు. మూల మూర్తులకు అభిషేకం, అలంకరణ సేవాకాలం ఆలయ అర్చకులు అల్లాడి గోపికృష్ణ పంచాగ శ్రవణం, నవగ్రహ ఆరాధన కార్యక్రమంలో సప్తాహం ప్రారంభించినట్లు తెలిపారు. శ్రీరామ నవమి వరకు 7 రోజుల పాటు నిరంతరాయంగా భజనా కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. కాగా సప్తాహంలో పాల్గొన్న వారితో పాటు దేవతామూర్తుల దర్శనం కోసం వచ్చిన భక్తులకు నిరంతరం తీర్థ ప్రసాదాలతో పాటు నిత్యాన్నధాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామస్థులు, దాతల సహాయ సహకారంతో అంగరంగ వైభవంగా కొనసాగిస్తున్న కార్యక్రమాలకు పక్క జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలివస్తుంటారని అర్చకులు గోపికృష్ణ తెలిపారు. సీతారామ కళ్యాణోత్సవంతో ముగించిచనున్న సప్తాహం కార్యక్రమం చివరి రోజున సాయంత్రం 5 గంటలకు పురవీధుల మీదుగా మంగళహారతులు, ఆడపడుచుల కోలాటాలతో స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

పంటల సాగుకు శ్రీకారం



నవతెలంగాణ-జైపూర్

ఉగాదితో నూతన సంవత్సరం మొదలవుతుండగా ఖరీఫ్ సాగుకు సంబందించి రైతులు పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. వేకువ జామును పంట పొలాకు వెళ్లి వ్యవసాయ పనిముట్లు, కాడెద్దులను పూజించి దుక్కులు దున్నడం ప్రారంభించారు. భీమారం మండలం ఆర్కెపల్లి శివారు రైతు సందెల తిరుపతి కుటుంబ సభ్యులు ఆదివారం తెల్లవారు జామున సాగుబాటు చేసినట్లు తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన వ్యవసాయ పనులు నిరంతరాయంగా ఏడాది పొడవు కొనసాగాలని, పంటల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించి సంమృద్ధిగా వర్షాలు కురువాలని కోరుకున్నారు. కాగా తాత ముత్తాతల నుంచి వ్యవసాయ కుటుంబాల వారు ఉగాది రోజున పంట పొలంలో సాగు బాటు చేయడం ఆనవాయితిగా పాటించడంతో పాటు పంట పొలంలో కుటుంబ సభ్యులు నోరు తీపి చేసుకోవడం జరుగుతుంది.

ఫూలే సంస్కృతిని అందరూ ఆచరించాలి



బీసీ భవన్‌లో నిర్వహించిన పూలే ఉగాది సంబరాల్లో వివిధ సంఘాల నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

మహాత్మా జ్యోతిబా పూలే అందించిన శ్రామికవర్గ సంస్కృతిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాల ప్రజలందరూ ఆచరించాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో జరిగిన పూలే ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలోని మెజారిటీ వర్గాల హక్కుల సాధన కోసం జ్యోతిబా పూలే 150 యేళ్ల క్రితం స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఉద్యమ స్ఫూర్తిని నేటి తరం పుణికి పుచ్చుకోవాలని కోరారు. బహుజన వర్గాల శ్రమతోనే ప్రపంచం నడుస్తుందని మనువాదులు ప్రవచించే మంత్రాలు, పంచాంగాలతో కాదన్న సత్యాన్ని నేటి ప్రజలు గుర్తించాలని స్పష్టం చేశారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచనగా ఉగాది పండుగను స్వీకరించి బహుజన సంస్కృతిలో పండుగ జరుపుకోవాలని వారు కోరారు. ఆధిపత్య వర్గాల సంస్కృతిని కూలదోసి పూలే అంబేడ్కర్లు చూపిన బాటలో శ్రామిక వర్గ సంస్కృతిని నిలబెట్టాలన్నారు. పంచాంగం పేరుతో మూఢాచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని వారు కోరారు. గ్రహాలు, నక్షత్ర ఫలాలు అనే తప్పుడు మాటలని నమ్మకుండా.. కష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్న సత్యాన్ని అందరూ గుర్తించాలన్నారు. బహుజన వర్గాలే సమస్త సంపద సృష్టికర్తలని.. వారు ఆత్మాభిమానాన్ని సంతరించుకుని మనువాదుల ముందు మోకరిల్లడం మానుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కోఆర్డినేటర్ చలమల్ల అంజయ్య, రిటైర్డు ఎంఈఓ శ్రీరామోజు కొండయ్య, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి కన్వీనర్ మోతె రామదాసు, సామాజిక ఉద్యమకారుడు కామిల్ల జయరాజు, మానవ వికాస వేదిక నాయకులు పత్తి సత్తయ్య, మాడిశెట్టి విశ్వం, వేముల అశోక్, అడిచర్ల రాజేశం, సంజీవ్, ప్రశాంత్, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, రాములు పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్ దరఖాస్తుల స్వీకరణ గడువు పొడగింపు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి ఉద్యోగులు పదవీ విరమణ పొందిన వారు కొత్తగా కాంట్రిబ్యూటరీ రిటైర్డ్ మెడికేర్ స్కీంలో చేరేందుకు గడువు పెంచుతూ సింగరేణి జీఎం (పర్సనల్) ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా 31 వరకు గడువుగా నిర్ణయించిన యాజమాన్యం ఎప్రిల్ 15 వరకు సీపీఆర్ఎంఎస్ కార్డు కోసం ధరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. సింగరేణి ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన వారికి కాంట్రిబ్యూటరీ రిటైర్డ్ మెడికేర్ స్కీం ద్వారా ఒప్పంద ఆస్పత్రుల ద్వారా ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చింది. గతంలో రూ.40 చెల్లించి సీపీఆర్ఎంఎస్ కార్డు పొందిన రిటైర్డ్ కార్మికుడు ఆయన భార్యతో కలిసి సింగరేణితో ఒప్పందం చేసుకున్న ఆస్పత్రుల ద్వారా వైద్య సేవలు పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రూ. 60 చెల్లించిన వారికి మాత్రమే సీపీఆర్ఎస్ కార్డులు పంపిణి చేయనున్నట్లు తెలిసింది. కొత్తగా ఈ పథకంలో చేరాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా రూ.60 చెల్లిస్తే సంబంధిత గనుల ద్వారా వ్యక్తి గత వివరాలతో ధరఖాస్తు చేసుకోవాల్సివుంటుంది. ఈ కార్డును పొందిన వారు తనతో పాటు తన భార్యకు కలిపి రూ.8 లక్షల పరిమితితో వైద్యం స్వీకరించడానికి యాజమాన్యం అవకాశం కల్పించింది. పదవీ విరమణ పొందిన కార్మికులు వివిధ ప్రాంతాలలో స్థిర నివాసమై ఉంటున్నందున వారి సౌలభ్యం కోసం హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల తదితర పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులతో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది.

ఉచితంగా కూలింగ్ వాటర్ పంపిణీ

నవతెలంగాణ-మంచిర్యాల

అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకు నగునూరి అమరావతి జ్ఞాపకార్థం వారి కుమారులు నగునూరి సాయి లచ్చన్న, నగునూరి శ్రీకాంత్‌లు కూల్ వాటర్ ఏర్పాటు చేశారు. వేసవి కలం దృష్ట్యా ప్రజలకు కూల్ వాటర్ అందిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు .ప్రజలకు సేవ చేసే కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు రావాలని ఏబీఏపీ సేవా సంస్థ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఏబీఏపీ సేవ సంస్థ సభ్యులు బేతి తిరుమల రావు, చుంచు రాజ్ కిరణ్, వొడ్నాల రవీందర్, సిరిపురం రాజేశం పాల్గొన్నారు.



వయోవృద్ధుల కాలక్షేపానికి టీవీ విరాళం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో సామాజిక వేత్త ముడుపు మౌనిష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పచ్చడి స్వీకరించారు. అనంతరం వయోవృద్ధుల కాలక్షేపం కోసం రూ.35 వేల స్మార్ట్ టీవీని విరాళంగా అందించారు. 70 ఏండ్లు దాటిన వయోవృద్ధులను సన్మానించారు. భుక్తాపూర్‌లో వయోవృద్ధులను సత్కరించి ఔషద మొక్కలను పంపిణీ చేశారు. ఇందులో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్పాండే, రాంకులకర్ణి, ఉదారి నారాయణ, మాజీ కౌన్సిలర్ ప్రకాష్, సమాఖ్య సభ్యులు సత్యనారాయణ, పాశం రాఘవేంద్ర, శ్రీనివాసరెడ్డి, కిషన్, నర్సిములు, బండారి రాజేష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.